# కాలమ్ దాటనికథ

అతను డాక్టరు. మందులిస్తాడు.

ఇతను డాక్టరు. కథలు రాస్తాడు.

అతనే ఇతను — ఇతనే అతనైతే — కథలు రాసే డాక్టరు మందు లిచ్చినా — మందులిచ్చే డాక్టరు కథలు వ్రాసినా... కొంపలేం మునగవ్ — మునిగిన కొంప ల్లోకి పడవలేం రావు మనం వాటినెక్కి బయట పడటానికి.

నిజం! సూర్యారావు ఆరేళ్ళ బట్టి నిజమైన డాక్టరే — ఎంబీబియస్సే! అతని 'రోగుల నిలయం'ముందు రోగులకేం చింత లేదు. డాక్టరు గారికి డబ్బుకు చింతాలేదు. డబ్బు దానికదే వస్తుంది. ఆయన 'కలం' విరామ మెరుగని దానిలా ప్రిస్క్రిప్షన్స్ రాస్తూనే ఉన్నది. కాని ఆ అర్థం కాని చిన్న చిన్న మందుల పేర్లు రాసీ రాసీ కలం విసుగెత్తి పోయింది!

రాజారావు 'చింతపల్లి సుబ్బమ్మ' రాసిన రాతలపై, ఆమెపై రీసెర్చి చేసి 'డాక్టరు' బిరుదును పొందాడు. ఆయన కలం ఎన్నో వేల కాగితాలు రాసి రాసి అలసి పోయింది. ఇకరాయలేనని మొరేసింది. ఆయన 'డాక్టరేటు'కు ఆదాయం రావటం లేదు. కలం ముందుకు సాగటం లేదు.

## కోరికలు

సూర్యారావూ, రాజారావూ ఒకానొక బూతు సినిమా వద్ద కలుసుకొన్నారు.

బాగున్నారా అంటే బాగున్నారా అని పలకరించు కొన్నారు. తర్వాత ఎవరి అసంతృప్తి వారు వెళ్ళ గక్కుకొన్నారు.

"నాకు ఆదాయం ఉంది, అన్నీ ఉన్నాయి. కాని నాకు పేరు లేదు. ఏ నోట విన్నా నీ పేరే — డాక్టరు రాజారావని. నన్ను నా రోగులే బయటకు పోయి తిడ్తారు, అంత గుంజాడు — ఇంత గుంజాడని. అందుకే ఇంకో లైను కోసం చూస్తున్నాను రాజారావ్" అని సూర్యారావూ.

"నిజానికి నా పరిస్థితీ అంతే సూర్యారావ్! పేరయితే ఉంది. లాభమేమిటి? విటమిన్ ఎమ్ ఉండాలిగా! ఎన్ని లిమరిక్కులు, చమక్కులు, థీసెస్సులు రాసినా పైసా రావటంలే! దానికై మార్గం చూస్తున్నా!" అని రాజారావ్.

ఇద్దరిలో తళుక్కున మెరుపులాంటి ఆలోచన!

దాని కార్య రూపమే —

డాక్టరు సూర్యారావు, ఎంబీబియస్సు రచయితగా

డాక్టరు రాజారావు ఎమ్.ఎ., పిహెచ్.డి. హోమియో డాక్టరుగా సెటిలయ్యారు.

ఆయన పెన్నుకు బోలెడు బిజీ!

ఈయన పెన్నుకు అంతా రెస్టే!

ఆయనకు బొచ్చెడు పేరు.

ఈయనకు పెట్టెడు డబ్బు!

—ప్రషాడార్కె

# 'జడ్జిమెంట్' శీర్షిక మార్చండి

ప్రతిరోజూ మీరు పత్రికలలో స్త్రీలపై జరిగే అత్యాచారాలలో ముఖ్యమైనదైన రేప్ గురించిన వార్తలను చదువుతూ వుంటారు. ఈ అత్యాచారం జరిగాక సాధారణంగా బాధితులు పోలీసులకు రిపోర్టు చేస్తారు. కోర్టులలో కేసు నడుస్తుంది. కాని ఆ కేసు ఎలా జరుగుతుందో, చివరకి ఏమవుతుందో మీకు తెలియదు. ఈ అత్యాచారం గురించి భారతీయ శిక్షాస్మృతి ఏమంటున్నదో తెలుసుకోండి.



భారతీయ శిక్షాస్మృతి 375 సెక్షన్ మానభంగం (రేప్) గురించి వివరాలు ఇలా నిర్వచిస్తున్నది. ఒక పురుషుడు మానభంగం చేసినట్లు ఈ దిగువ పేర్కొన్న ఆరు పరిస్థితులలో ఒక స్త్రీతో సంగమించినప్పుడు ఇలా అయినట్లయితే అది 'రేప్'గా నిర్ణయించబడుతుంది.

ఒకటి - ఆమె ఇచ్ఛకు వ్యతిరేకంగా

రెండు - ఆమె అంగీకారం లేకుండా.

మూడు - ఆమె అంగీకారంతో, అనగా ఆమెకు గాని, ఆమెకు చెందిన ఏ ఇతర వ్యక్తిని గాని చంపుతాననిగాని, గాయపరుస్తాననిగాని భయపెట్టి అంగీకారాన్ని పొందిన సందర్భాలలో.

నాలుగు - ఆమె అంగీకారంతో ఆమెకు తను భర్తనుకాదని తెలిసీ, అతనితో చట్ట సమ్మతంగా పెళ్ళి జరుగుతుందనే నమ్మకం కలిగించినందున ఆమె పొందుకు అంగీకరించినట్లయితే.

ఐదు - ఆమె అంగీకారంతో, తన అంగీకారాన్ని తెలిపే సమయంలో ఆమె సరయిన మానసిక స్థితిలో లేకుండా వుండి వున్నట్లయితే లేదా ఏదైనా మాదకద్రవ్యాన్ని సేవించడం వల్ల మత్తు కలిగించే స్థితిలో వుంటే, స్వయంగా తన వల్ల గాని ఇతరుల వల్లగాని ఏదైనా పదార్థాన్ని ఇప్పించినందున ఆ మైకంలో ఏమి జరుగుతుందో తెలియని స్థితిలో ఆమె అంగీకారం గనుక ఇచ్చి వున్నట్టయితే.

ఆరు - ఆమె అంగీకారంతో గాని, అంగీకారంలేకుండా గాని ఆమె 16 సంవత్సరాలలోపు వయస్సు స్త్రీ అయితే -

ఇవి రేపు కేసులవుతాయి.

ఇవన్నీ చదివి మీ కోసం ఆలోచించి

ప్రఖ్యాత రచయిత శ్రీ హరికిషన్ వ్రాసిన నవల

## జడ్జిమెంట్

జడ్జిమెంట్ నవల పేరును ఆకర్షణీయంగా మార్చాలని కోరే పాఠకులకు ఒక సూచన - పై పేరాలలో చెప్పిన అంశాలను దృష్టిలో పెట్టుకుని కొత్తపేరు ఏదైనా సూచించే బాధ్యత పాఠకుల మీద వుంచుతున్నాము.

- ఎడిటర్

పోస్ట్‌బాక్స్ నెం. 712,
ఆంధ్రజ్యోతి సచిత్ర వారపత్రిక,
లబ్బీపేట, విజయవాడ - 10

మీకు నచ్చిన శీర్షికను - పోస్ట్ కార్డుమీద మాత్రమే - వ్రాసి 20-7-1986 లోపు పంపాలి.
ఎన్నికైన శీర్షిక సూచించిన వ్యక్తికి రు. 116 విలువైన బహుమతి అందజేస్తాము.